

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ అక్రమాలను సక్రమం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి-2025 చట్టాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతితో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. 22/ఏలో ఉన్న ప్రభుత్వ భూములను ఈ చట్టం ద్వారా రక్షించనున్నట్లు వెల్లడించారు. భూ సమస్యలు ఉన్న రైతులు, భూ యజమానులు రెవెన్యూ సదస్సులో అధికారులకు దరఖాస్తులు ఇచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 236 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, హయత్‌నగర్ సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సుఖ్‌దేవ్ సింగ్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఏసీపీ

సంతోష్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్‌సింగ్ హెచ్చరించారు. బక్రీద్ పండగ సందర్భంగా సంతోష్‌నగర్ పోలీ‌స్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సూచించారు. బస్తీలు, కాలనీల్లో ప్రజలను బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణ, అదనపు ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డి, ఎస్‌ఐలు శివప్రసాద్, రవిగౌడ్, మణికంఠ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై రేషన్ డీలర్ దురుసు ప్రవర్తన

చాదర్‌ఘాట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు డీలర్ తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పలువురు మహిళలు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలాడేరాలో రేషన్ షాపు నంబర్ 126 వద్ద బియ్యం కోసం ప్రజలు మంగళవారం బారులు తీరారు. బియ్యం తూకం వేయకుండానే డీలర్ ఇస్తుండడంతో పలువురు మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తూకం వేయకుండానే ఇస్తానని, ఇష్టం ఉంటే తీసుకెళ్లమని డీలర్ అనడంతో మహిళలు అధికారులకు ఫిర్యాదు చేశారు. మహిళలపై దురుసుగా ప్రవర్తించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విచారణ చేశాం

రేషన్ బియ్యం తీసుకోవడానికి వచ్చిన మహిళలపట్ల డీలర్ దురుసుగా ప్రవర్తించాడన్న ఫిర్యాదుపై విచారణ చేశాం. అందుకు గల కారణాలపై ఆరా తీశాం. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

- నర్సింగ్‌రాజ్, ఏఎస్‌వో, మలక్‌పేట సర్కిల్-1



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, భక్తులు

హనుమాన్ టెంపుల్ హుండీ ఆదాయం రూ.1.75 లక్షలు

సరూర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడలో గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఏడాది కాలానికి హుండీ ఆదాయం రూ. 1,75,921 వచ్చిందని చైర్మన్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రామిడి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, పగుడాల మురళి, హైమావతి, మల్‌రెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పగడాల యాదయ్య

అటవీ సంపదను 'కార్పొరేట్'కు కట్టబెట్టేందుకే కగార్

మన్సూరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. సీపీఐ(ఎం) హయత్‌నగర్ సర్కిల్ కమిటీ సమావేశాన్ని మన్సూరాబాద్ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యాదయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకుండా వారిని కాల్చి చంపుతోందని ఆరోపించారు. సాహెబ్‌నగర్‌లోని సర్వే నంబర్. 71, 162లలో గల ప్రభుత్వ భూమిలో అర్హులందరికీ స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో నిరుపేదలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేనివారు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, కొత్త గణేష్‌గౌడ్, తిరుమల, సంధ్య, బి. భాస్కర్, సీహెచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సుభద్రనగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి

వనస్థలిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ సుభద్రనగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కాలనీవాసులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మణస్వామి, హరగోపాల్, మూర్తి, సుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా హనుమద్వాహన సేవ

కొత్తపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి కాలనీలో పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హనుమద్వాహన సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమద్వాహనంపై కోదండ రామస్వామి అవతారంలో శ్రీనివాసుడు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ కళాకారుడు జీఎస్‌కే కౌశిక్ పాడిన అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించాయి.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవు

మన్సూరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్వీయ శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. అరుణోదయ కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలో సమస్యలను పరిష్కరించాలని అధ్యక్షుడు మధుసూదన్ రాజు ఆధ్వర్యంలో డీసీకి ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేటర్ చింతల అరుణ సమక్షంలో డీసీ యాదయ్యకు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న కాలనీ సభ్యులు

సైదాబాద్‌లో..

సైదాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్‌లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌ను డిప్యూటీ కమిషనర్ జయంత్, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. స్పెషల్ డ్రైవ్ మూడు రోజులపాటు కొనసాగుతుందన్నారు. రోడ్లపై మట్టి, చెత్త కుప్పలు, చెట్లకొమ్మల తొలగింపుపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఏలు దేవేందర్, నాగరాజు, కళ్యాణ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేయొద్దు

ఎల్బీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. మంగళవారం సరూర్‌నగర్ వార్డు కార్యాలయం వద్ద కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, ఉపకమిషనర్ సుజాత శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకటేశ్వరకాలనీ, శ్రీనివాసకాలనీ, సరూర్‌నగర్ ఓల్డ్ విలేజ్, పోచమ్మబాగ్, కుమ్మరిబస్తీ, బాపునగర్, భగత్‌సింగ్‌నగర్, జైస్వాల్‌కాలనీ ప్రాంతాలలో రోడ్లను, ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేశారు. దోమల మందును పిచికారీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారులు చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడే వేయొద్దని, స్వచ్ఛ ఆటో వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ పారిశుధ్య విభాగం డీఈ చందన చౌహాన్, ఎంటమాలజీ ఏఈ రాంబాబు, శానిటరీ సూపర్‌వైజర్ బుచ్చయ్య, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.



సరూర్‌నగర్ వార్డు కార్యాలయం వద్ద శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, ఉపకమిషనర్ సుజాత శ్రీధర్



మహిళలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మీర్‌పేట్ కమిషనర్ జ్ఞానేశ్వర్

వీధుల్లో చెత్త వేస్తే జరిమానా

సరూర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని మీర్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం 45వ డివిజన్‌లోని కాలనీల్లో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధుల్లో ఎత్త వేసే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సెప్టెంబరు 10వ తేదీ వరకు వందరోజుల యాక్షన్ ప్లాన్ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అక్కి మాధవీ ఈశ్వర్‌గౌడ్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలి

ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

చంపాపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చంపాపేట్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా ఉండాలే తప్ప దానికి యజమానులము కాదన్నారు. ఇటీవల తాను హరీ‌శ్‌రావుతో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయని, తాను ఎవరితోనైనా మాట్లాడతానని, మాజీ సీఎం కేసీఆర్ కలిస్తే కూడా మాట్లాడతానని అన్నారు. కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ చంపాపేట డివిజన్‌కు యూజీడీ, రహదారులు ఇతర అభివృద్ధి పనులకు అత్యధిక నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జడ్‌సీ హేమంత కేశవ్ పాటిల్, డీసీ సేవ ఇస్లావత్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్, టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీ పేజ్-1లో రూ.95లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాత నాయక్‌తో కలిసి మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్‌రెడ్డి, నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: మల్లికార్జున నగర్ కాలనీ, జహంగీర్‌నగర్ కాలనీలో నిర్మించిన పార్కు, సీసీ రోడ్డు పనులను మంత్రి శ్రీధర్ బాబు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, వజీర్ ప్రకాశ్‌గౌడ్, మల్లికార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నిరంజన్ పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి, సుభాష్‌చందర్జీ తదితరులు

ఉగ్రవాదులను ఆపరేషన్ సిందూర్‌తో మట్టిలో కలిపాం

చాదర్‌ఘాట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ మహిళల జోలికి వచ్చిన పాకిస్థాన్ ఉగ్రమూకలను ఆపరేషన్ సిందూర్‌తో మట్టిలో కలిపామని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని మలక్‌పేటలోని బీజేపీ కార్యాలయం వద్ద తిరంగా ర్యాలీని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ దుగ్యల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ జి.సుభాష్‌చందర్జీతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ పటేల్, నాయకులు రమేష్ రెడ్డి, గౌర దేవేందర్, చందు, ఎల్‌బీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ఫిక్సింగ్‌గా జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాలు

- ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదు
- బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం



జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం తీరును వివరిస్తున్న బీజేపీ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి అంజన్, శ్రవణ్, మహేందర్

ఎల్బీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి నిర్ణయాలు తీసుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాలు మ్యాచ్ ఫిక్సింగ్‌గా కొనసాగుతున్నాయని బీజేపీ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి అంజన్, శ్రవణ్, మహేందర్ మండిపడ్డారు. మంగళవారం సరూర్‌నగర్‌లో వారు మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాల తీరును ఎండగట్టారు. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్వహించే కౌన్సిల్ సమావేశాలతో ప్రజలకు ఉపయోగం ఉండటం లేదన్నారు. సమావేశాలలో ప్రజా సమస్యలు చర్చ జరగడం లేదన్నారు. బస్తీల్లో చెత్త పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయని, డ్రైనేజీ పైపులైన్‌లు లీకై మురుగు నీరు రోడ్లపై పారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు. టౌన్‌ప్లానింగ్ అవినీతి, నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ అనుమతుల్లో జాప్యం, అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయన్నారు. ఆస్తిపన్ను ఇష్టానుసారంగా పెంచేస్తున్నారని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాలు ప్రజల అభివృద్ధి కోసం జరగాలన్నారు.

అక్రమ కేసును ఉపసంహరించుకోవాలి

- బీజేపీ నాయకుడు కందాళ బల్‌దేవ్‌రెడ్డి



ప్లాటు పత్రాన్ని చూపిస్తున్న కందాళ బల్‌దేవ్‌రెడ్డి

హయత్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తనపై అక్రమంగా పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసును ఉపసంహరించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు కందాళ బల్‌దేవ్‌రెడ్డి కోరారు. మంగళవారం కొహెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొహెడలోని సర్వేనంబర్ 956లోని వెంచర్‌లో ప్లాటు కొనుగోలు చేశానన్నారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇబ్బందులు కలిగిస్తుండడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా కలిసి అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారని, దానికి తనను జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నారన్నారు. ఇది జీర్ణించుకోలేని కొందరు గ్రామస్థులు తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. అక్రమంగా పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో శివగంగ, తిరుమల హిల్స్ రేస్‌కోర్సు రోడ్డు, మూసారాంబాగ్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సలీంనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, పర్వత్ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జీపీ బ్యాంకు కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, శాలివాహన నగర్, హరిహర క్షేత్రం ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ పేర్కొన్నారు.

బండ్లగూడ గ్రామాభివృద్ధికి కృషి



భవానీ శంకర్ గౌడ్

మన్సూరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కమిటీ నూతన అధ్యక్షుడు చెరుకు భవానీ శంకర్‌గౌడ్ అన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా చెరుకు భవానీశంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా మెట్టు మురళి, ప్రధానకార్యదర్శిగా తూర్పాటి నారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఎన్.రంగయ్య, ట్రెజరర్‌గా సుర్వి జగదీష్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రుద్రగోని పాండు గౌడ్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రాజేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులుగా గుండగోని రాముగౌడ్, పి.నాగేశ్వర రావు ఎన్నికయ్యారు.

నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ నెల 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ తెలిపింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బత్తుల సోమన్న, క్రిష్టోఫర్ మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ. 25వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారని, వీటి అమలును రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రకటించకపోవడంతో ఉద్యమకారులు నిరాశతో ఆందోళనకు సిద్ధమయ్యారని తెలిపారు. శాంతియుతంగా అన్ని జిల్లాల్లో నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.మాధవి రెడ్డి, సుమతి, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

కన్యకాపరమేశ్వరి కాలనీలో

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని కన్యకాపరమేశ్వరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. మంగళవారం కాలనీ వాసులతో కలిసి జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లపైకి మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

32 గ్రాముల పుస్తెల తాడు స్వాధీనం

సరూర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకుని పారిపోయిన నిందితుడిని మీర్‌పేట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, మూడుదండ్ల గ్రామ పరిధిలోని పోల్యా నాయక్‌తండాకు చెందిన రమావత్ రవీందర్ అలియాస్ నవీన్(21) బాలాపూర్ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో అద్దెకు ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌తోపాటు మద్యపానం, జల్సాలకు అలవాటుపడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించాలనుకొని మహిళల మెడలో బంగారు గొలుసులు చోరీ చేయాలని పథకం వేశాడు. గత నెల 31వ తేదీ ఉదయం మీర్‌పేట్‌లో మంత్రాలచెరువు వద్ద వాకింగ్ చేస్తున్న మిథిలానగర్‌కు చెందిన కె.కృష్ణకుమారి మెడలో గల 32 గ్రాముల బంగారు మంగళసూత్రం లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితుడి నుంచి రూ. 2.50 లక్షల విలువైన 32 గ్రాముల బంగారు పుస్తెల తాడు స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై అత్యాచారం.. ఇద్దరిపై కేసు

సైదాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు వ్యక్తులపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్ పరిధిలో ఓ బస్తీలో నివసిస్తున్న బాలిక(16) తమ్ముడు, చెల్లెలితో కలిసి గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన మన్నె జగన్ ఆటోలో వెళ్లేంది. ఆటో డ్రైవర్‌తో బాలిక చనువుగా ఉండేది. దీంతో ఆటో డ్రైవర్ ఆమెకు మాయ మాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం చేశారు. బాలిక పొరుగు ఇంటికి టీవీ చూడటానికి వెళ్తుండేది. అన్నగా పిలిచే బాలరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక విషయం కుటుంబ సభ్యులకు చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైదాబాద్ పోలీసులు నిందితులిద్దరిపై కేసు నమోదు చేశారు.

ఓయూలో నిరుద్యోగుల ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేయకపోతే ఈనెల 18న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ ప్రకటించారు. జాబ్ నోటిఫికేషన్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు నిరుద్యోగులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రభుత్వం జాబ్ నోటిఫికేషన్లను విడుదల చేస్తుందని నిరుద్యోగులు వేచి చూశారని, నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సూర్యాపేట జిల్లా రామచంద్రాపురానికి చెందిన దర్శనం నాగరాజు.. అబ్దుల్లాపూర్ మెట్‌లో ఉంటూ తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. సరూర్‌నగర్ పీఎస్ పరిధిలో నివసిస్తున్న బాలికను 2024లో పెళ్లి చేసుకుంటానని తీసుకెళ్లి పలు మార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. పోక్సో కేసు నమోదు చేసిన సరూర్‌నగర్ పోలీసులు నాగరాజును అరెస్టు చేసి జైలుకు తరలించారు. విచారణాధికారి సైదిరెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా కోర్టు నాగరాజుకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.6 లక్షల పరిహారం ప్రకటించింది.

పదో తరగతిలో మండల టాపర్‌కు రూ. 10 వేలు



పదవ తరగతి ఫలితాల్లో అబ్దుల్లాపూర్‌మెట్ మండల టాపర్‌గా నిలిచిన మజీద్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కీర్తనకు బీఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బూడిద రాంరెడ్డి రూ. 10 వేలు అందజేశారు. స్కూల్ హెచ్‌ఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

-అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి